క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో ఏపీఐఐసీ చైర్మన్ జంకే

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఏపీఐఐసీ చైర్మన్ జంకే వెంకట్‌రెడ్డి మంగళవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జంకే వెంకట్‌రెడ్డికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఐసీఏఐ అధ్యక్షుడిగా రవికిషోర్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ శాఖ అధ్యక్షుడిగా నిట్టా రవికిషోర్ ఎన్నికయ్యారు. నగరంలోని ఐసీఏఐ భవన్‌లో మంగళవారం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా కె.నారాయణ, కార్యదర్శిగా యు.జయంత్, కోశాధికారిగా మనీష్ కుమార్ జైన్, ఐసీఏఐ విజయవాడ శాఖ విద్యార్థి సంఘం చైర్మన్‌గా వీవీ పవన్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నిట్టా రవికిషోర్ మాట్లాడుతూ సీఏ కోర్సు చదువుతున్న విద్యార్థులకు కోర్సులోని అంశాలపై తమ కమిటీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే సీఏలుగా స్థిరపడిన వారికి పన్నుల విధానంలో కొత్తగా వస్తున్న మార్పులుపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకు అకౌంట్స్ రంగంలో నిపుణులతో సదస్సులు, పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని రవికిషోర్ వివరించారు. ఐసీఏఐ విజయవాడ శాఖ పూర్వ అధ్యక్షుడు వి.నరేంద్రబాబు, జి.శ్రీనివాసరావు, ఎస్.అక్కయ్య నాయుడు తదితరులు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.

శ్రీవారి భక్తుడిని కాపాడిన తిరుమల పోలీసులు

తిరుమల: తిరుమలలోని అవ్వాచారి కోనలో దూకేందుకు ప్రయత్నించిన ఓ శ్రీవారి భక్తుడిని తిరుమల టూ టౌన్ పోలీసులు కాపాడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన సాయి హర్ష(32) తిరుమల శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాడు. సప్తగిరి గెస్ట్ హౌస్‌లో గది అద్దెకు తీసుకున్నారు. ఈ సమయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగడంతో మనస్తాపానికి గురైన సాయి హర్ష భార్యకు చెప్పకుండా బయటకు వచ్చి అక్కడ డిస్‌ప్లే బోర్డులో ఉన్న సీఐ సత్యనారాయణ నంబర్‌కు కాల్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని సమాచారం అందించాడు. దీంతో వెంటనే స్పందించిన సీఐ తమ సిబ్బందితో కలసి సాయి హర్ష ఉన్న ప్రాంతానికి వెళ్లి అతన్ని పట్టుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వలంటీర్ల సేవలు నిరుపమానం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



వలంటీర్లకు సత్కారం చేస్తున్న భాగ్యలక్ష్మి, ఆసిఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలబడి లంచాలు, వివక్షకు తావు లేకుండా ప్రభుత్వ ద్వారా నిస్వార్థంగా అందిస్తున్న వలంటీర్ల సేవలు నిరుపమానమైనవని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 53వ డివిజన్ పరిధిలో మార్కెట్ వద్ద 37, 38, 51, 52, 53 డివిజన్లకు చెందిన వలంటీర్లకు మంగళవారం సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఐదు డివిజన్లకు గాను 181 సేవా మిత్రలు, నాలుగు సేవా రత్నలు, ఒకరికి సేవ వజ్ర పురస్కారాలను అందించి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. వారి అమూల్యమైన సేవలను గుర్తించిన జగనన్న ప్రభుత్వం పలు సేవా పురస్కారాలను అందజేస్తోందన్నారు. కరోనా కలవరపెట్టినా, వరదలు వణికించినా, ఆదివారం, పండుగ, సెలవు దినాలైనా వేకువ జామునే అవ్వాతాతలకు శుభోదయం చెప్పి ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్న వలంటీర్లకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని అన్నారు. ఇదే స్ఫూర్తితో నిరంతరం వారు సేవలు కొనసాగించేలా ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అందిస్తున్న చిరుసత్కారం ఇది అని అన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ వలంటీర్లకు వరుసగా నాలుగవ ఏడాది కూడా జగనన్న ప్రభుత్వం అభినందన సత్కారం చేయడం వారికి మరింత ఉత్సాహాన్నిస్తుందని అన్నారు. పేదలకు మంచి చేసే కార్యక్రమంలో వలంటీర్ల సేవలు కొనసాగేలా వారిని మరింతగా ప్రోత్సహిస్తూ ఇప్పటివరకు అందిస్తున్న నగదు పురస్కారాల మొత్తాన్ని మరింత పెంచారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మండేపూడి చటర్జీ, షేక్ రెహమతున్నీసా, మరుపిళ్ల రాజేష్, బుల్లా విజయ్‌కుమార్, పలువురు పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సామాజిక విప్లవంతోనే సమసమాజం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అసమానతలు లేని సమాజం సామాజిక విప్లవం ద్వారానే సాధ్యమని కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. హనుమాన్‌పేటలోని టీవీ భవన్‌లో మంగళవారం ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, మేరీస్ స్టెల్లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని అసమానతలు లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత స్థాయి విద్యావంతులు కూడా కులమత, సామాజిక, ఆర్థిక పరమైన అంశాల్లో సంకుచిత ఆలోచనలు చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. సమాజంలో ఇటువంటివి వాంఛనీయం కాదని, వీటిని రూపుమాపాలంటే మరో సామాజిక విప్లవం అవసరమని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పీ విజయబాబు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. అసమానతలను రూపుమాపేందుకు నేటి యువత ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. అనంతరం బాలలపై వేధింపులు అరికట్టాలని రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేరీ స్టెల్లా కళాశాల సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ సిస్టర్ సహాయమేరి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ డైరెక్టర్ బీఎస్ కోటేశ్వరరావు, కోఆర్డినేటర్ అరవ రమేష్, దిశ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అహ్మదున్నీసా, జనశిక్షణ సంస్థ చైర్మన్ నాగళ్ల విద్యాకన్నా, డైరెక్టర్ పూర్ణిమ, సంఘ సేవకులు చుక్కపల్లి అరుణ్‌కుమార్, ప్రజా గాయకుడు ఆర్ పిచ్చయ్య, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటిప్రకాష్, మేరీస్ స్టెల్లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రానున్న ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ములేక పొత్తుల కోసం ఆరాటపడుతున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో ఆసిఫ్ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. రాఘవరెడ్డి రోడ్డు నుంచి ప్రారంభమై కుమ్మరివీధులు, కేటీరోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగారు. 51వ డివిజన్‌లో అపూర్వమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కొండ ప్రాంతాల్లోనూ అనేక కార్యక్రమాలను చేపట్టారని వివరించారు. డివిజన్‌లో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇర్ఫాన్, చైతన్యరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓ యువకుడు మద్యానికి బానిసై మనస్థాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు.. కృష్ణలంక బైరెడ్డి వారి వీధిలో నివసించే పైడి సురేష్(35) ఉడ్ పాలీష్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య ఉమాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడు సోమవారం పనికి వెళ్లకుండా మద్యం తాగి ఇంటి వద్దే ఉండడంతో భార్య మందలించింది. అనంతరం భర్తకు ఉమాదేవి భోజనం వడ్డించి ఇంటి బయటకు వెళింది. రాత్రి 10.30 గంటల సమయంలో భర్తను ఎన్నిసార్లు పిలిచినా, తలుపులు తట్టినా స్పందన లేక పోవడంతో అనుమానం బంధువులను పిలిచింది. వారు వచ్చి కిటికీలో నుంచి లోపలకు చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా ధ్వజారోహణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణోత్సవాన్ని అర్చకస్వాములు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి శేషవాహన సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

మలేషియాలో ఉన్నత విద్యావకాశాలు

గుణదల (విజయవాడ తూర్పు): భారత దేశానికి మలేషియా దేశంతో మంచి ద్వైపాక్షిక సంబంధాలున్నాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి అన్నారు. నోవాటెల్ హోటల్‌లో మంగళవారం మలేషియా ఎడ్యుకేషన్ ఫెయిర్ జరిగింది. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ మలేషియాలో అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని తెలిపారు. వాణిజ్యం, పరిపాలన, ఆరోగ్యం, కంప్యూటింగ్, ఇంజనీరింగ్ కోర్సులలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నారని వివరించారు. అనంతరం మలేషియా ప్రొఫెసర్ టీమ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించింది. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి అసిస్టెంట్ కమిషనర్ ఉషారాజ్యలక్ష్మి, మలేషియాకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తన

విజయవాడ కల్చరల్: అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార బృందం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో మంగళవారం అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ రమాసత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను సత్కరించారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొత్త ఓటర్లు తమకు ఓటు హక్కు కోసం అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లకు పది రోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి 19 వరకు వచ్చిన కొత్త ఓట్ల దరఖాస్తుల సంఖ్యను తెలియ జేశారు. ఫామ్ 9 అంటే కొత్త ఓటర్ల దరఖాస్తు ఫారమని, ఫామ్ 10 అంటే డెత్, డూప్లికేట్, శాశ్వత మైగ్రేషన్ అని, ఫామ్ 11లో ఫారం 11ఎ, 11బి, ఉంటాయని పేర్కొన్నారు. ఫామ్ 11ఎ నియోజకవర్గంలో ఎవరైనా ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో పోలింగ్ బూత్‌కు షిఫ్ట్ అయ్యే దరఖాస్తు ఫారమని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో షిఫ్ట్ అయ్యే ఓట్లను 11బి ఫామ్‌లో నమోదు చేస్తారని, అవి నియోజకవర్గ పరిధి దాటి బయట నుంచి వచ్చిన ఓట్ల దరఖాస్తులని చెప్పారు. ఇలా వచ్చిన ఓట్ల దరఖాస్తులను ఏఈఆర్‌ఓలు రాండమ్‌గా మూడు నాలుగు సార్లు స్వయంగా చూసి కచ్చితమైన ఆధారాలు ఉంటేనే బదిలీ చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి ప్రాంతాల్లో గల సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించి తెలియ జేయాలని సూచించారు. తద్వారా సెక్యూరిటీ ఫోర్స్‌ను పెంచే అవకాశం ఉంటుందని అన్నారు. ఓటరు కార్డులో కరెక్షన్లకు ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చే వరకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో గుండె సుందర్‌పాల్(వైఎస్సార్ సీపీ), ఎన్.సాంబశివరావు(టీడీపీ), అన్సారి(కాంగ్రెస్), ఎం.వినోద్‌కుమార్ (బీఎస్‌పీ), చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్ఈ రామమోహన్, డెప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్లు , సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు రెండు గంటలపాటు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్ వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి వీధి, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, ఔట్ ఏజన్సీ ఏరియా, మీరా సాహెబ్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులు అసౌకర్యానికి గురి కాకుండా చూడాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తించే సమయాల్లో వారు ఎటువంటి అసౌకర్యానికి గురి కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలోని నూతన భవనంలో గల సమావేశ మందిరంలో ఆయన పబ్లిక్ హెల్త్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన యూనిఫాంలు, ఐడీ కార్డులు, కొబ్బరి నూనె, సబ్బు, పాదరక్షలు సత్వరమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్న ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు ఉండి కూడా వాడలేని పరిస్థితులు ఉన్నా, ఇతర సమస్యలేమైనా ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుతో అన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు -1, 2, 3 డాక్టర్ కె.సురేష్ బాబు, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ బాబు శ్రీనివాస్ (ఇన్‌చార్జ్), ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ఆస్తుల ఆక్రమణలను సహించేది లేదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వక్ఫ్ బోర్డు ఆస్తులను అక్రమంగా అనుభవిస్తూ కొంతమంది ముస్లిం మైనారిటీలకు అన్యాయం చేస్తున్నారని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యనమలకుదురులోని మసీదు, ఈద్గా, ఖబరస్తాన్, షాపులను అష్రఫ్ అనే వ్యక్తి కుటుంబం కబ్జా చేసిందన్నారు. విచారణ నిమిత్తం నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన వక్ఫ్ బోర్డు అధికారులపై దౌర్జన్యం చేశారన్నారు.